చెరువులు, కుంటలను పరిరక్షించాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్

కాప్రా, సెప్టెంబర్ 9 : మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని వివిధ మండలాల చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులను ఆక్రమించి బహుళ అంతస్తులను నిర్మించిన అక్రమార్కులను వెంటనే అరెస్టు చేసి, సదరు భూములను స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సీహెచ్ దశరథ్ అధ్యక్షతన జరిగిన మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా సీపీఐ కౌన్సిల్ సమావేశానికి బాలమల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను రక్షించాలని, బాధ్యులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. జిల్లా పరిధిలోని కాప్రా చెరువు, యాప్రాల్ పరిధిలోని నాగిరెడ్డి చెరువు, బండబాయి కుంట, అల్వాల్ చిన్నరాయుడు చెరువు, కుత్బుల్లాపూర్ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువు, శామీర్‌పేట్ మండలం మెడిసిటీ హాస్పిటల్, బొమ్మరాసిపేట తదితర చెరువు స్థలాలను ఆక్రమించారని తెలిపారు. చెరువులు, కుంటల ఆక్రమణలను హైడ్రా కమిషనర్ తక్షణమే పరిశీలించి వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శులు దామోదర్ రెడ్డి, ఉమామహేశ్, కార్యవర్గ సభ్యులు దశరథ్, ఆర్.కృష్ణమూర్తి, ధర్మేంద్ర, రచచ కిషన్, శంకర్‌రావు, టి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ

● మంత్రి జూపల్లి కృష్ణారావు


కాళోజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, డాక్టర్ నామోజు బాలాచారి, మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, సెప్టెంబర్ 9 : పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు తెలంగాణ సాహిత్యానికి, సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనమని, తెలంగాణ యాసకు, భాషకు జీవం పోసి.. ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదిన మహనీయుడని పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ నారాయణరావు 110 జయంతి వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అధ్యక్షతన జరిగిన కాళోజీ జయంతి సందర్భంగా.. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ–మానవతా విలువలు అనే అంశంపై సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళోజీ స్వాతంత్ర్య సమరయోధుడిగా , సామాజిక ఉద్యమకారుడిగా, కవిగా తెలంగాణ సమాజానికి చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. అన్యాయం ఎక్కడ జరిగినా కాళోజీ గళమెత్తేవారని, అసమానతలు, దోపిడీ, నిరాదరణకు గురవుతున్న వారిలో ఆయన కలం చైతన్యం నింపిందని గుర్తు చేశారు. ముఖ్యంగా స్థానిక భాషను రాయాలని, ఇతరుల భాషను అనుకరించే బానిస భావన పోవాలన్నారు. ఆయన తపించిన తీరుతో ప్రతి ఒక్కరిలో ఆత్మ గౌరవం వెల్లివిరిసిందన్నారు. కాళోజీ కవితా సంకలనం, నా గొడవలో ఆయన రాసిన అనేక పద్యాలను ఉటంకిస్తూ.. ఆయన కవితాశక్తిని , బావుకతను, పోరాట ప్రతిభను, తెలంగాణ తపనను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అంతటి మహనీయుడు తెలంగాణ గడ్డపై పుట్టడం మనందరికీ గర్వకారణమని కొనియాడారు.70 మంది కవులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, టూరిజం, క్రీడల ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, అందెశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : పాలకుల భాష మాత్రమే ప్రజాభాష కాదంటూ, ప్రజా వ్యవహారంలోని భాషను సగౌరవంగా ఆదరించాలని తెలిపిన భాషావాది, ప్రజాకవి కాళోజీ అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు కొనియాడారు. పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులంతా శ్రమనీది, రాత నీది, జీవిత మంతా తెలంగాణది అంటూ కాళోజీకి ఘన నివాళుల ర్పించారు. అనంతరం ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ... తెలంగాణ భాష, యాస కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆచార్య పి వారిజారాణి మాట్లాడుతూ... ఒక్క సిరాచుక్క లక్షమెదళ్లకు కదలిక అన్న నినాదం ద్వారా సాహిత్యశక్తిని లోకానికి అందించిన కాళోజీ తన కవిత్వంలో పీడిత వర్గం కోసం పాటుపడిన విధానాన్ని తెలిపారు. అనంతరం ఆచార్య వి.త్రివేణి, డాక్టర్ విజయ్ కుమార్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వర్‌రావు, డా.బాశెట్టి లత, ఆచార్య డి.విజయలక్ష్మి, భూక్యా తిరుపతి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేశ నాయక్, పరిశోధకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ కవి ..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని జలమండలిలో నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం గర్వించదగ్గ కవుల్లో కాళోజీ ఒకరని, సాహితీరంగంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని ఎండీ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, డైరెక్టర్ సుదర్శన్ ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జలమండలి ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఉద్యోగులు ప్రతిష్టించిన గణపతికి ఎండీ అశోక్‌రెడ్డి పూజలు నిర్వహించారు.


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే మర్రి

మల్కాజిగిరి, సెప్టెంబర్ 9: అంగన్‌వాడీ సెంటర్ల సమస్యలు పరిష్కరిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లి క్యాంపు కార్యాలయంలో అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ట్లాడుతూ.. టీచర్లు, సూపర్‌వైజర్ల సమస్యలు పరిష్కరిస్తామని, నెలనెలా టీచర్ల సమావేశాలకు ప్రభుత్వ పరంగా నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 77 అంగన్‌వాడీ సెంటర్లలో నీటి సదుపాయం, బాత్రూమ్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, సూపర్‌వైజర్లు జమశీల, వింధ్యావాహిని, టీచర్లు మీనాక్షి, రాణి, మమత, రాజ్యలక్ష్మి, శోభారాణి, రమాదేవి, విజయలక్ష్మి, సంధ్య, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

'కాఫీ విత్ కలెక్టర్'

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెంచేందుకు కృషి చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రోహిణి పాల్గొన్నారు.

మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు..

● పంచాయతీ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన

తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని మోకాళ్ల పై కూర్చొని నిరసన తెలుపుతున్న ఘాన్సిమియాగూడ గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 9 : మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని ఘాన్సిమియాగూడ గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని కోరారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేస్తే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటామన్నారు. గ్రామస్తులకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ప్రత్యేకాధికారి వాల్యానాయక్ కలిసి మున్సిపాలిటీలో విలీనం కోసం తీర్మానం పత్రాలను ఉన్నతాధికారులకు అందించారిన ఆరోపించారు. వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. అనంతరం గ్రామ పంచాయతీ నుంచి హైదరాబాద్–బెంగుళూరు జాతీయ రహదారి వరకు ర్యాలీ చేసి, రోడ్డుపై ఆందోళనకు దిగారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని పంపించారు. కార్యక్రమంలో జగన్‌గౌడ్, రాంనాథ్ ముదిరాజ్, ఆనంద్ ముదిరాజ్, ఇమ్రాన్, రవీందర్ గౌడ్, మల్లేశ్ గౌడ్ నందం, రాజు, లాలప్ప, సురేశ్ గౌడ్, సిద్దయ్య, ప్రభూ, అభీబ్, గఫార్, కిట్టు ముదిరాజ్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎస్సీ భుజంగరావుపై భూ వివాదం కేసు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): భూ వివాదంలో తలదూర్చడమే కాకుండా కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ భూ యజమానులను బెదిరింపులకు గురిచేసినట్లు వచ్చిన అభియోగంపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు మాజీ పోలీసు అధికారి భుజంగరావుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కూకట్‌పల్లికి చెందిన అబ్బాస్ అలీఖాన్ కుటుంబ సభ్యులకు సర్వే నంబర్ 1007లో 340 ఎకరాల స్థలం వివాదంలో ఉంది. భూ వివాదం కోర్టులో ఉండగానే శ్రీనివాస్, అనిల్, ఎస్ఎస్ మోయినుద్దీన్ అనే వ్యక్తులు కలిసి కోర్టు పరిధిలో ఉన్న స్థలానికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి కబ్జా చేశారు. అప్పుడు కూకట్‌పల్లి ఏసీపీగా పనిచేసిన భుజంగరావు వత్తాసు పలకారని బాధితులు ఈనెల 5న సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అందులో ఏ4గా భుజంగరావు పేరును చేర్చారు.

కులగణన, 42 శాతం రిజర్వేషన్లే లక్ష్యం

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ఖైరతాబాద్, సెప్టెంబర్ 9 : బీసీల కులగణన, 42 శాతం రిజర్వేషన్లే ఏకైక లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ బీసీ జన సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం సమితి అధ్యక్షుడు జస్వంత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... దశాబ్దాలుగా బీసీలకు పాలక పార్టీలు వల్ల అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టి, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ జాతీయ నేత రాహుల్ గాంధీ స్పష్టంగా చెబుతున్నారని, కులగణన కోసం పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు పెట్టాలని డిమాండ్ చేయడం స్వాగతించాల్సిందేనన్నారు. రాష్ట్రంలోనూ అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేసే విధంగా చొరవ తీసుకుంటానని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీ నినాదం ఎత్తుకున్నా ఎవరూ నమ్మలేదని, ఫలితంగా 240 సీట్లకు పడిపోయిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హామీలను వెంటనే అమలు చేయాల్సిన బాధ్యత పాలక కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో టీజేఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, బైరి రమేశ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, మహిళా విభాగం కన్వీనర్ లక్ష్మి, విద్యార్థి విభాగం నాయకులు అరుణ్ కుమార్, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సాయికుమార్ ముదిరాజ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదులు, బీసీ సంఘం నాయకులు దేవిక పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రారంభం

● నేటి నుంచి 16వ తేదీ వరకు హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం ప్రారంభం కావడంతో నేటి నుంచి ఈ నెల 16వ వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. పీవీఎన్ఆర్ మార్గ్(నెక్లెస్ రోడ్డు)లో గణేశ్ నిమజ్జనానికి విగ్రహాలను తరలిస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ ఉంటుందన్నారు. ఇందులో భాగంగా పైలింగ్ క్లబ్ టి జంక్షన్, వీవీ విగ్రహం, తెలుగుతల్లి జంక్షన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ ఎక్స్ రోడ్డు, నల్లగుట్ట బ్రిడ్జి, నల్లగుట్ట పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

కేబుల్స్ తొలగించేందుకు గడువు కోరిన కేబుల్ ఆపరేటర్స్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్థంగా, ప్రమాదకరంగా ఉన్న కేబుల్స్‌ను తొలగించేందుకు కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖను గడువుకోరారు. సోమవారం ఖైరతాబాద్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీని కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ తర్వాత కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్‌నెట్ సర్వీసు ప్రొవైడర్లు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నగరంలోని ప్రధాన రహదారులపై దాదాపు 50 శాతం పోల్స్‌పై అడ్డదిడ్డంగా వేలాడుతూ, సాధారణ ప్రజలకు ప్రాణాంతకంగా పరిణమించిన కేబుల్స్‌ను సరిచేశామని, మిగతావాటిని వీలైనంత త్వరగా తొలగించేందుకు వేగంగా పనులు చేస్తున్నామన్నారు. ఇందుకు మరింత గడువు కావాలని ప్రతినిధులు కోరారు. కేబుల్స్ ఆపరేటర్స్ ప్రతినిధులు విజ్ఞప్తిని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వారి అభిప్రాయం మేరకు కార్యచరణ ఉంటుందని, అప్పటి వరకు తొలగింపు పనులు వేగంగా చేపట్టాలని సూచించామని, నగరంలో దాదాపు 28 కంపెనీలు ఈ తొలగింపులు చేస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

ఆలోచిస్తే.. సమస్యకు పరిష్కారం..!

● ఆత్మహత్యాయత్నానికి ముందు ప్రవర్తనలో మార్పు
● గుర్తించి ప్రాణాలు కాపాడాలంటున్న సైకాలజిస్టులు
● నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : క్షణికావేశంలో జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కూరి రామచంద్రం అన్నారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, అనవసర ఆలోచనలతో బంగారు భవిష్యత్తును తుడిచి వేసుకోవద్దని సూచించారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ కౌన్సెలింగ్ ఆత్మహత్య నివారణ కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ఒత్తిడిని అధిగమించడం పై సూచనలు చేస్తామని తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందున్న లక్షణాలు ఎలా ఉంటాయి? వాటిని ఇంట్లో వాళ్లు ఎలా గుర్తించాలి? వాటిని అధిగమించడానికి బాధితులకు ఎలాంటి ఉపశమనం అందించాలి? తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ''వారిలో వారు ఏదో మాట్లాడుకుంటూ ఉంటారు. ఎవరైనా మాట్లాడాలని చూస్తే పెద్దగా మాటలు కలుపరు. ఇతరులతో సంబంధం లేనట్టు ఉంటారు. సూసైడ్ వీడియోలు ఎక్కువగా చూస్తూ ఉంటారు. ''ఒత్తిడి, అశాంతి, భయం, అభద్రత, నిరాశ, తదితర మానసిక కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒటమి, అవమానం భరించలేక కొందరూ సూసైడ్ అటెంప్ట్ చేస్తున్నారు. చిన్న కారణమే అయినా వారికి పెద్ద సమస్యగా కనిపిస్తుంది. వారిని గుర్తించి అండగా ఉంటే ప్రాణాలను కాపాడినవాళ్లమవుతాం.'' అని మోత్కూరి రామచంద్రం పేర్కొన్నారు. కౌన్సెలింగ్ సేవలకు 9533660938 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బల్దియాలో బది'లీలలు'..!

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న కొందరు అధికారులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ఒక్కసారి బల్దియాలో పోస్టింగ్‌లోకి వస్తే చాలు..తిరిగి బదిలీపై వెళ్లేందుకు కొందరు అధికారులు ఇష్టపడటం లేదు. ట్రాన్స్‌ఫర్ అయినా.. బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేది లేదు..ప్రభుత్వ ఆదేశాలు సైతం మా ముందు బలాదూర్' అన్నట్లు వారు తిరిగి తమ స్థానాన్ని పదిలం చేసుకుంటున్నారు. ఇందుకు జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ (డిప్యూటీ కమిషనర్)ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బదిలీ జరిగిన చోటుకు వెళ్లకుండా ప్రభుత్వ స్థాయిలో తన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌ను రద్దు చేయించుకొని..తిరిగి అదే పోస్టులో కొనసాగేలా మరో ఉత్తర్వు తెప్పించుకోవడం ఇప్పుడు బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. సదరు డీసీకి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నీ తానై అండదండగా నిలిచి.. సదరు అధికారి స్థానాన్ని పదిలం చేయడంలో కీలక పాత్ర పోషించారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అలాగే ఓ డీసీ సిద్దిపేటకు ట్రాన్స్‌ఫర్ జరిగినా.. అక్కడికి వెళ్లకుండా తిరిగి మాతృసంస్థలో రిపోర్టు చేసి.. తిరిగి జీహెచ్ఎంసీలోకి వచ్చేలా ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. వీరితో పాటు జీహెచ్ఎంసీలో అంతర్గతంగా అన్ని క్యాడర్లలో కలిపి దాదాపు 350 మంది ఉద్యోగులకు స్థానచలనం కల్పిస్తూ ఇటీవల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 40 మంది వరకు తిరిగి యథావిధిగా మళ్లీ అదే కుర్చీలో ఉండేందుకు కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోగా, వారికి ఓకే అంటూ.. గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఉద్యోగవర్గాల్లో చర్చకు దారితీసింది.

టౌన్‌ప్లానింగ్‌లో..

టౌన్‌ప్లానింగ్‌లో అస్తవ్యస్తంగా బదిలీలు జరిగాయి. అసలే టౌన్‌ప్లానింగ్‌లో అధికారుల కొరత ఉండగా...అందుకు తగ్గట్లుగా బదిలీలతో మరింత కొరత ఏర్పడింది. ఇక అంతర్గతంగా ఉన్న వారిని క్రమక్రమంగా బదిలీలు జరిపించాల్సిన చోట ఉన్న పళంగా ఏసీపీలను మార్చేశారు. దీంతో సీపీలు కొత్త కావడం, ఏసీపీలు కూడా కొత్త వారే ఉండటంతో సంబంధిత సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో నిర్మాణ రంగ అనుమతుల జారీపై తీవ్ర ప్రభావం పడింది. ఒక్కొక్క సీపీ, ఏసీపీ వద్ద వందలాది ఫైళ్లు పేరుకుపోయాయి. వాటిని క్లియర్ చేయాలంటే అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి.

గణపతి పూజలో టీఎన్జీవో నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి హౌజింగ్ సొసైటీలో నెలకొల్పిన వినాయక మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీఎన్జీవో నేతలు పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, భాగ్యనగర్ టీఎన్జీవో గచ్చిబౌలి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, చిలుక నర్సింహారెడ్డి, రవి ప్రకాశ్, శ్రీకాంత్, జ్ఞానేశ్వర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ప్రజాపాలనలో పారదర్శకత లోపించింది

ప్రజాసంఘాల ప్రజాభిప్రాయ సేకరణలో బాధితులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రజావాణిలో పారదర్శకత లోపించిందని, దరఖాస్తుల స్టేటస్ ట్రాక్ చేస్తే అంతా గందరగోళంగా ఉందం టూ ప్రజలు ఆందోళన చెందుతున్నారని ప్రజాసంఘాలకు చెందిన ప్రతినిధులతో కూడిన పీపుల్స్ జ్యూరీ సభ్యులు అభిప్రాయపడ్డారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం 'తెలంగాణలో మరింత పటిష్టమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఆవశ్యకత'పై పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ, విచారణ నిర్వహించారు. మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వ్యవస్థాపకుడు నిఖిల్ డే, గ్రామ్యరిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ రుక్మిణీరావు, ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ జాతీయ కన్వీనర్ మీరాసంఘమిత్రలతో కూడిన ప్రత్యేక పీపుల్స్ జ్యూరీ ఈ విచారణకు అధ్యక్షత వహించింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజాపాలన, వితంతు పింఛన్లు, అటవీ హక్కుల చట్టం అమలు, పెండింగ్ ఇళ్ల పంపిణీ తదితర అంశాలపై బాధితులు తమ ఫిర్యాదులను తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజావాణి నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ రవికిరణ్ మాట్లాడుతూ... ప్రజాభిప్రాయసేకరణలో బాధితులు చెప్పిన సమస్యలు ఉన్నాయన్నారు. అయితే సమస్యల పరిష్కారానికి.. రాజస్థాన్‌లోని జన్‌సూచ్‌నా పోర్టల్ తరహాలో సమాచార పోర్టల్‌ను రూపొందిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రజావాణిని బలోపేతం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. రైతు స్వరాజ్య వేదిక, తెలంగాణ పట్టణ పోరాటాల వేదిక, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ, ఏఎస్ఈఎం, దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, లిబ్టెక్, సోషల్ అకౌంటబిలిటీ ఫోరం ఫర్ యాక్షన్ అండ్ రీసెర్చ్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాయి.

14, 15న అస్మిత ఖేలో ఇండియా వుమెన్స్ సైక్లింగ్ లీగ్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ఈనెల 14, 15న అస్మిత ఖేలో ఇండియా వుమెన్స్ సైక్లింగ్ లీగ్(రోడ్) నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నామని డాక్టర్ మాక్స్‌వెల్ ట్రెవర్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.కె. పాషా తెలిపారు. ఈనెల 19, 20న త్రివేంద్రంలో అస్మిత ఖేలో ఇండియా వుమెన్స్ సైక్లింగ్ లీగ్ (ట్రాక్) నిర్వహిస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రేటర్ అభివృద్ధికి రూ. 10,500 కోట్లు కేటాయించండి

16వ కేంద్ర ఆర్థిక కమిషన్‌కు మ